సాక్షి సూర్యాపేట

బుధవారం । 7 । మే । 2025



హైవే.. ఆరు వరుసలు
హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. -8లో



ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు
మాధారంకలాన్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
40°/27°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం వ్యాఖ్యలు ఆక్షేపనీయం



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న

సూర్యాపేటటౌన్ : ఉద్యోగుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఆక్షేపనీయమని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీపీఎఫ్‌కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు పాలకులకు అధికారాన్ని అప్పగించారని అన్నారు. ప్రజలందరి బాగోగుల కోసమే ఉద్యోగులు పనిచేస్తారని చెప్పారు.ప్రజల్లో భాగమే ఉద్యోగులు అన్న విషయాన్ని సీఎం గుర్తించుకోవాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్ ప్రయోజనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు బోనస్ కోసం ఉద్యమాలు చేస్తున్నారని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడటం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బండారు శ్రీనివాస్, శిరగాని యాకయ్య, సుధాకర్‌రెడ్డి, పోతురాజు నర్సయ్య, దీకొండ మహేష్, జిల్లా జానయ్య, ఎస్.కె.సుభాని, మల్లయ్య, తూము శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే ఉపాధి కూలీలకు వేతనాలు



ఉపాధి కూలీల మస్టర్లు తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఓ అప్పారావు

మోతె: ఉపాధిహామీ పథకం కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు అందుతాయని డీఆర్‌డీఓ అప్పారావు తెలిపారు. మంగళవారం మోతె మండల పరిధిలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. మట్టి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి కూలీలతో ముచ్చటించారు. కూలీలందరూ ఉదయం 7 గంటలకు పనులకు హాజరవుతున్నారా? రోజుకు ఎంత కూలి వస్తుందని అడిగారు.రోజూ 150 మాత్రమే కూలి వస్తుందని కూలీలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.307 వేతనం అందుతుందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు,నీడ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూలీల మస్టర్లలో హాజరు తీసుకున్నారు. గ్రామంలో నర్సరీని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఏపీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి, ఈసీ శ్రీహరి, ఫీల్డ్‌అసిస్టెంట్ గజ్జి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



ఈయన పులుగుజ్జ యాకేష్. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో ఐకేపీ కేంద్రానికి 20రోజుల కిందట ధాన్యం తెచ్చిపోయారు. నిర్దేశిత తేమ శాతం వచ్చి పది రోజులు అవుతోంది. లారీల కొరత కారణంగా కాంటాలు వేయడం లేదు. దీంతో కేంద్రంలో ఉండాల్సి వస్తోంది.

❖ నేరేడుచర్ల ఐకేపీ కేంద్రంలో కాంటాలు వేసినా, లారీలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని తరలించాల్సిన లారీ కాంట్రాక్టర్ నెల రోజుల్లో నాలుగుసార్లు మాత్రమే లారీని పంపించి చేతులెత్తేశారు. అడిగితే మీరే ట్రాక్టర్లు, లేదా డీసీఎం పెట్టుకొని తీసుకెళ్లండి.. బిల్లు ఇస్తానని ఉచిత సలహా ఇచ్చేశారు. దీంతో రైతులు కాంటా వేసిన ధాన్యాన్ని తామే మిల్లులకు తరలించుకుంటున్నారు.

ఎగుమతికి లారీలేవీ?

తూకం వేసిన ధాన్యం బస్తాలు కల్లాల్లోనే..
- లారీల కొరతతో కొన్నిచోట్ల కాంటాలు కూడా వేయడం లేదు
- ధాన్యం ఎగుమతి అయినా.. మిల్లుల వద్ద కూడా కొర్రీలు
- ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు సవాలక్ష కష్టాలు



సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తిరుమలగిరి పీఏసీఎస్ కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తగా మారింది. అధికారుల అజమాయిషీ లేకధాన్యం కల్లాలకు తెచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నిర్దేశిత తేమ శాతం వచ్చినా తూకం వేయక, వేసినా కూడా లారీలు రాక రోజుల తరబడి ఆ కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన వస్తోంది. కొన్ని చోట్ల లారీ కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో రైతులే వాహనాలను పెట్టుకొని ధాన్యం తరలించాల్సి వస్తోంది. ఆ తరువాత ట్రక్ షీట్ ఆలస్యంగా రావడం, చివరకు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు రావడం కూడా 20 రోజులపైనే పడుతోంది.

కొర్రీలు పెట్టి కోత విధిస్తున్నారు
కల్లాల్లో తూకం వేసేప్పుడు బస్తాకు కిలో అధికంగా తూకం వేస్తుండగా, తూకం వేసిన ధాన్యం మిల్లరు వద్దకు తీసుకెళ్లాక, ధాన్యం బాగలేదంటూ దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతున్నారు. దీంతో సంబంధిత కొనుగోలు కేంద్రానికి మిల్లర్లు ఫలానా రైతు ధాన్యం బాగలేదని చెప్పడం, దీంతో నిర్వాహకులు నీ ధాన్యం బాగలేదంట.. బస్తాకు 2 కిలోలు మిల్లర్లు కోత వేస్తారట.. లేదంటే నీ ఇష్టం అని చెబుతుండటంతో రైతులు అంగీకరించక తప్పడం లేదు. ఇలా 40 కిలోల బస్తాకే 3 కిలోల చొప్పున దోపిడీ చేస్తున్నారు. అందుకు ఒప్పుకుంటేనే ట్రక్ షీట్ రైతుకు అందుతోంది. అప్పుడే ఆ ట్రక్ షీట్ ఆధారంగా రైతు ఎంత విక్రయించారన్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. లేదంటే ధాన్యం వెనక్కి పంపిస్తామంటూ బెదిరిస్తున్నారు.

❖ ఆత్మకూర్.ఎస్ మండలంలో లారీల కొరత తీవ్రంగా ఉంది. కాంటాలు వేసినా లారీలు సకాలంలో రాకపోవడంతో బస్తాలు అలాగే ఉంటున్నాయి. రోజుకు రెండు మూడు లారీలు రావాల్సి ఉండగా మూడు రోజులకు ఒక లారీ మాత్రమే వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

మిల్లర్లు ఆడిందే ఆట...
మిల్లర్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. అసలే కాంట్రాక్టర్లు కొద్దిపాటి లారీలను ధాన్యం రవాణాకు పంపిస్తున్నారు. అయితే ధాన్యం దిగుమతి చేసుకోలేమంటూ నల్లగొండ చుట్టుపక్కల ఉన్న మిల్లర్లు రెండు మూడు రోజులు కొర్రీలు పెట్టడంతో నల్లగొండ ధాన్యాన్ని మిర్యాలగూడ, దేవరకొండ మిల్లులకు తరలించినట్లు సమాచారం. అంటే ఇటు ట్రాన్స్‌పోర్టు చార్జీలు ప్రభుత్వంపై అదనంగా పడుతున్నాయి. అధికారుల అజమాయిషీ లేకపోవడంతో మిల్లర్లు చెప్పిందే వినాల్సివస్తోంది.

సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసుకున్నాం



నేరేడుచర్లలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసినా లారీలు రావడం లేదు. దీంతో సొంత వాహనాలు ఏర్పాటు చేసుకుంటే బిల్లులను చెల్లిస్తామని అధికారులు చెప్పారు. దీంతో సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నాం.
– ధానావత్ చాంప్లా, పుల్గంబండతండా, నేరేడుచర్ల

లారీలు సమయానికి రావడం లేదు



దాదాపు 60 క్వింటాల ధాన్యాన్ని తీసుకువచ్చి 20 రోజులు అవుతుంది. వారానికి రెండు లారీలు కూడా వెళ్లడం లేదు. దీంతో కాంటాలు ఆలస్యం అవుతున్నాయి. రోజు రెండు నుండి మూడు లారీలు వస్తే కాంటాలు త్వరగా అవుతాయి.
– గుద్దేటి జాన్‌రెడ్డి, ఆత్మకూరు.ఎస్

ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



కుడకుడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల(సూర్యాపేట) : ఐకేపీ కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. మంగళవారం చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యం 17 శాతం తేమ రాగానే వెంటనే కాంటాలు వేయాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా లక్ష్మణ్



రామన్నపేట: వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణానికి చెందిన భైరబోయిన లక్ష్మణ్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీఎస్‌జీఓ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో అయనను కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ వసతిగృహ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

మేళ్లచెరువు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు కాన్పులకోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఐకేపీ కేంద్రాలు,ఉపాధిహామీ లో పనిచేసే కార్మికులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వై. సీతామహాలక్ష్మి,కోదాడ సీహెచ్‌ఓ సుమిత్ర, సురేష్, సూపర్‌వైజర్లు వినోద్, రాజ్‌కుమార్, బందెల రాములు, రాజేష్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

మట్టపల్లి ఆలయం ముస్తాబు

నేటి నుంచి 10 వరకు అధ్యయనోత్సవాలు
- 11న అర్ధరాత్రి స్వామివారి తిరుకల్యాణం
- భారీగా తరలిరానున్న భక్తులు



వేడుకలకు ముస్తాబైన మట్టపల్లి దేవాలయం

మఠంపల్లి: ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే అధ్యయనోత్సవాలకు మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఈనెల 10 నుంచి 15వరకు తిరుకల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు చెన్నై తదితర నగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

- ❖ 7నుంచి 10వరకు తొలక్కం, అధ్యయనోత్సవం, పరమపద ఉత్సవం, శాత్తుమరై పూర్తిచేసి అదే రోజు రాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు.
- ❖ 11న విశ్వక్సేనారాధన, అఖండదీపారాధన, అంకురారోపణ, ధ్వజారోహణం, లక్షమల్లికా సహస్ర నామార్చన, లక్షమల్లికా పుష్పపూజ, అర్ధరాత్రి ఎదుర్కోళ్ల ఉత్సవంతో శ్రీస్వామి అమ్మవార్లను అశ్వ, గజ, సింహ, గరుడ తదితర వాహనాలపై మంగళవాయిద్యాలతో భక్తుల జయజయ ధ్వానాల నడుమ కల్యాణ మండపానికి చేరుస్తారు.
- ❖ 12న తెల్లవారు జామువరకు శ్రీస్వామివారి కల్యాణం నిండుపున్నమి వెన్నెల రాత్రిలో శోభాయమానంగా నిర్వహిస్తారు. అనంతరం గరుడవాహనసేవ , శ్రీస్వామివారి రథోత్సవం, హరికథలు, బుర్రకథలు ఏర్పాటు చేశారు.
- ❖ 13న శ్రీసూక్త సహిత మహాలక్ష్మియాగం, సాయంత్రం శ్రీస్వామి వారు కృష్ణానదిలో హంసవాహనంపై నావావిహారం చేస్తారు.
- ❖ 14న చక్రతీర్థం, వసంతసేవ, దోపుఉత్సవం చేపడతారు.
- ❖ 15న శృంగార డోలోత్సవం, పవళింపు సేవతో తిరుకల్యాణోత్సవాలు ముగుస్తాయి.

అన్నదాన ఏర్పాట్లు
ఉత్సవాలకు వచ్చేభక్తులకు సుమారు 22కులాల అన్నదాన సత్రాలతో పాటు దేవస్థానం వారుకూడా భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు సరిపడా లడ్డూ, పులిహోర ప్రసాదాలు సిద్ధం చేశారు. ఎండతీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకవర్గం తెలిపింది. కృష్ణానదిలో భక్తులకు పుణ్యస్నానాలు ఆచరించడానికి ఏర్పాట్లు పూర్తికావస్తున్నాయి. ఆర్టీసీ ఆంధ్రాప్రాంతంలోని దాచేపల్లినుంచి, తెలంగాణ ప్రాంతంలోని హుజూర్‌నగర్ నుంచి అదనపు బస్సులు నడుపనుంది.



గర్భాలయంలోని మూలవిరాట్

11 నుంచి వాహనసేవలు
ఈనెల 11న రాత్రి కల్యాణమూర్తి అలంకారంలో గజ, సింహ, శేషవాహనములు, 12న ఉదయం గరుడవాహనంపై శ్రీమన్నారాయణమూర్తి అలంకారం, సాయంత్రం శ్రీరాజమన్నార్ అలంకారంలో రథోత్సవం, 13న సాయంత్రం హంసవాహనంపై శ్రీరంగసాయి అలంకారం, 14నఅశ్వవాహనంపై శ్రీజయమన్నార్ అలంకారం, 15న పవళింపుసేవ నిర్వహించనున్నారు.

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మట్టపల్లి దేవాలయంలో జరగనున్న తిరుకల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వివిధ కులాల అన్నదాన సత్రాలు భక్తులకు భోజన వసతులు కల్పించనున్నాయి. లడ్డూ,పులిహోర ప్రసాదాలు సిద్ధం చేస్తున్నాం
– చెన్నూరు విజయ్‌కుమార్, అనువంశిక చైర్మన్,మట్టపల్లి దేవాలయం

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న కలెక్టర్, రమేష్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి.

భానుపురి (సూర్యాపేట) : ఆరోగ్యం విషయంలో ఆడపిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. సూర్యాపేట డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 306 మంది లబ్ధిదారులకు రూ.3.06 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు న్యూట్రిషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆహారంలో అన్ని పోషకాలు లేకపోవడం వల్ల వివిధ వ్యాధుల బారినపడుతున్నారన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వాలని ప్రభుత్వం లక్ష రూపాయలను కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద అందజేస్తుందన్నారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ పేద ఆడపిల్ల పెళ్లికి రూ.1,00,116 అందించడం ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఒక్క తెలంగాణలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, లాలు, హరికిశోర్‌శర్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా



నారాయణపురంలో సీపీఐ మండల మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిలుకూరు: పేద ప్రజల సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా అని మాజీ ఎమ్మెల్యే , సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే పాలకులు సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఉపాధిహామీ పథకానికి, వ్యవసాయ, కార్మిక రంగాలకు కేంద్రం బడ్జెట్ లో నిధులు తగ్గించడం వల్ల దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో పాలకులు ఆలోచన చేయాలన్నారు. పార్టీనాయకులు ప్రజల పక్షాన బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభకు ముందు పార్టీ జెండాను పల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల మహాసభలో 250 మంది ప్రతినిధులు పాల్గొనగా, 35 మంది కౌన్సిల్ సభ్యులను, మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, యల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, బూర వెంకటేశ్వర్లు, కొండా కోటయ్య, చేపూరి కొండలు, దొడ్డా వెంకటయ్య, సాహెబ్ అలీ, కాంపాటి వెంకటయ్య, రెమిడాల రాజు, చిలువేరు అంజనేయులు, పొరడ్ల మట్టయ్య, జయసుధ, తాళ్లూరి వెంకటయ్య, కీసర వెంకటేశ్వర్లు, కందుకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 20న దేశవ్యాప్త సమ్మె

సూర్యాపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం కార్మికులను మోసగిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, కందాల శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాలాల నిండా వ్యర్థాలు

- సూర్యాపేట పట్టణంలో మురుగుతో నిండుతున్న డ్రెయినేజీలు
- డంపింగ్ యార్డులుగా పలు వీధులు
- కొన్నిచోట్లనే చెత్త తొలగింపు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

మున్సిపల్ కార్మికుల వివరాలు	
ఔట్‌సోర్సింగ్	313
కాంట్రాక్టు	110
పర్మినెంట్	48
మొత్తం	471



సూర్యాపేట పట్టణంలో వ్యర్థాలతో నిండిన నాలా



సూర్యాపేట పట్టణంలోని 28వ వార్డులో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త



చర్చి కాంపౌండ్ వెనుక ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఖాళీ స్థలం

తాళ్లగడ్డ (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. పలు వీధుల్లో రోజూ చెత్త తొలగించకపోవడం.. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నా వారంతా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చెత్త సేకరణకు పరిమితమయ్యారు. దీంతో మిగతా చోట్లలో డ్రెయినేజీల్లో చెత్త, మురుగు పేరుకుపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయినేజీలు పూడిపోతున్నా అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వినిస్తున్నాయి. దీంతో దుర్వాసనతో తట్టుకోలేకపోతున్నామని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ తొలగించకపోవడంతో..
సూర్యాపేట పట్టణంలోని 28 వార్డులో తాళ్లగడ్డ ఫైర్ స్టేషన్ ఎదురుగా జెజెనగర్‌లో, రాజారాం కాలేజ్ రోడ్, చర్చి కాంపౌండ్ వెనుక భాగం, గోపాలపురం, 60 ఫీట్ల రోడ్ నాలా, నల్లాలబావి, డీమార్ట్ దగ్గర నాలాలు, పట్టణంలోని పలు వీధుల్లో డ్రెయినేజీలు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. రోజూ ఇంట్లో, వీధిలోని వ్యర్థాలు ఊడ్చి కుప్పచేసినా పారిశుద్ధ్య కార్మికులు ఎత్తకుండా వెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్లలో వాడుకునే నీరు, వ్యర్థఆహార పదార్థాలు పైపులైన్ల ద్వారా డ్రెయినేజీల్లోకి చేరుతున్నా వాటిని తొలగించడం లేదు. దుర్వాసనను తట్టుకోలేక కాలువలపై బండలు, అట్టాలు, బస్తాలు కప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడి. అలాగే చర్చి కాంపౌండ్ వెనుక ప్రాంతంలో ఖాళీ స్థలాలు చెత్త డంపు కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీలు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయి అధ్వానంగా మారాయి. 60 ఫీట్ల రోడ్డు, నల్లాలబావి ప్రాంతాల్లో ప్రధాన నాలాలకు వచ్చే కాలువల్లో పూడిక తీయక కొన్నిచోట్ల మట్టితో నిండి గడ్డి మొలకెత్తడం పారిశుద్ధ్యకార్మికుల, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఫలితంగా దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని అంటున్నారు. పారిశుద్ధ్య సమస్యలపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ ను వివరణ కోరగా కార్మికులను పంపించి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తామని తెలిపారు.

ఖాళీ స్థలాల్లోని వ్యర్థాలను తొలగించాలి



చర్చి కాంపౌండ్ ప్రాంతంలో డ్రెయినేజీలు మురుగు, చెత్తతో నిండి ఉన్నాయి. కాలువలు పూడి నీరుపారక దుర్వాసన వస్తోంది. ఖాళీ స్థలాల్లో వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలలో దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చొరవ చూపి కాలువల్లో పూడిక తీయించాలి.
– గుడుపురి సత్యం, చర్చి కాంపౌండ్

ప్రధాన నాలాలను శుభ్రం చేయాలి



పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు ప్రధాన నాలాల్లోకి వస్తోంది. దీంతో నాలాల్లోకి చెత్త చేరుతోంది. నాలాల్లో పూడిక తీయకపోవడంతో దుర్గంధభరితంగా మారుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు నాలాల నుంచి షీల్ట్ తీయించి శుభ్రం చేయించాలి.
– కిరణ్ కుమార్, తాళ్లగడ్డ

క్లుప్తంగా

హనుమంతుడికి ఆకుపూజ



పూజ చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



కొప్పుల శ్రీజ

నకిరేకల్: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన కొప్పుల శ్రీజ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసిన శ్రీజ గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీజ పాల్గొంటుందని తెలిపారు.

రసాయన వ్యర్థాల శాంపిల్స్ సేకరణ



శాంపిల్స్ సేకరిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

చివ్వెంల(సూర్యాపేట): లారీల్లో రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సోమవారం రాత్రి చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారి పక్కన రహదారి పక్కన వదిలిపెట్టారు. మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రోడ్డు పక్కన పారబోసిన రసాయనిక వ్యర్థాల శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వ్యర్థాలు వదిలిన లారీలను స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

- స్వయంగా ప్రకటించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- రూ.10వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు నిర్ణయం
- విస్తరణ పూర్తయితే ప్రయాణం సులువు
- బ్లాక్‌స్పాట్‌ల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు

హైవే.. ఆరు వరుసలు



హైదరాబాద్-విజయవాడ హైవేపై చౌటుప్పల్ మండలంలోని ధర్మోజిగూడెం జంక్షన్

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. రూ.10వేల కోట్లతో ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం వరకు ఆరు వరుసల రహదారి విస్తరణతో పాటు సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక అక్కడి నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 181 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే రకరకాల కారణాలతో ఇప్పటివరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో హైవే విస్తరణ ప్రక్రియ పట్టాలెక్కింది.

అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించే బ్లాక్‌స్పాట్‌ల వివరాలు..

గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు	అంచనా విలువ (కోట్లలో)
పెద్దకాపర్తి	29.90
చిట్యాల	42.18
నల్లగొండ క్రాస్‌రోడ్డు, కట్టంగూర్	0.26
కొర్లపహాడ్	5.96
ఎస్‌వి.ఇంజనీరింగ్ కాలేజ్, జనగామ క్రాస్ రోడ్డు	58.04
ఈనాడు ఎదురుగా	27.97
దురాజ్‌పల్లి	2.80
ముకుందాపురం	13.86
ఆకుపాముల	2.16
కొమరబండ ఎక్స్ రోడ్డు	31.01
కటకమ్మగూడెం	10.89
మేళ్లచెరువు	0.46
శ్రీరంగాపురం	8.50
రామాపురం ఎక్స్‌రోడ్డు	30.26
నవాబుపేట	0.21
మొత్తం	264.84

ఎట్ గ్రేడ్ జంక్షన్ తొలగించే ప్రాంతాల్లో..

చౌటుప్పల్	114.40
టేకుమట్ల	41.42

నాలుగు వరుసల కోసం ఎన్నో పోరాటాలు

హైదరాబాద్-విజయవాడ హైవే రెండు వరుసలుగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరుగుతుండడంతో ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రజలు అనేక పోరాటాలు చేశారు. ఆ తర్వాత దీనిని నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గడంలేదు. 2011 నుంచి వందలాది మంది తమ ప్రాణాలను కోల్పోయారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ హైవే గుండా వాహనాలు రాకపోకల సంఖ్య పెరగడంతో రద్దీగా మారింది. ఆ రద్దీకి అనుగుణంగా నాలుగు వరుసలు ఏమాత్రం సరిపోవడంలేదు. దీంతో ఆరు వరుసలుగా విస్తరించాలని గత కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరుతూనే ఉన్నాయి. అయితే గతంలో ఈ హైవేను నాలుగు వరసలుగా విస్తరించిన జీఎంఆర్ సంస్థ కోర్టుకు వెళ్లడంతో గతేడాది వరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం జీఎంఆర్ సంస్థను ఈ హైవే బాధ్యతల నుంచి తప్పించారు. దీంతో అడ్డంకులు తొలగడంతో విస్తరణ అంశం వేగంగా ముందుకుసాగుతోంది.

ప్రమాదాలను అరికట్టేందుకు ప్రయత్నాలు

ఈ హైవేపై కొన్ని ప్రాంతాల్లోనే తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. అసలు ఈ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి, ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంలో నిర్వహించిన సర్వేల్లో అనేక కారణాలను గుర్తించారు. ఈ మార్గంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 17 బ్లాక్‌స్పాట్‌లు ఉన్నట్లు గుర్తించారు. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, ఎస్‌వీ కళాశాల–జనగామ ఎక్స్‌రోడ్, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి జంక్షన్, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ ఎక్స్‌రోడ్, కాటమ్మగూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, రామాపురం ఎక్స్‌రోడ్, నవాబ్‌పేట జంక్షన్ బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్నాయి. ముందుగా అత్యంత ప్రాధాన్యతా క్రమంలో ఆయా ప్రాంతాలలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించి కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించారు. అందులో భాగంగా ప్రస్తుతం ఆయా బ్లాక్‌స్పాట్‌లలోని కొన్ని ప్రాంతాలలో పనులు సైతం ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాలలో త్వరలోనే ప్రారంభంకానున్నాయి.

మరికొన్ని బ్లాక్‌స్పాట్‌లకు విస్తరణలో మోక్షం

ఈ మార్గంలో ఇంకా అనేక బ్లాక్‌స్పాట్‌లు ఉన్నాయి. వాటిని గుర్తించాల్సి ఉంది. గతంలో గుర్తించిన వాటికే ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తుండడంతో.. అప్పట్లో గుర్తించని ప్రాంతాలను మరోసారి గుర్తించి కేంద్రానికి నివేదిక అందిస్తే ఆరు లేన్ల విస్తరణ సమయంలో ప్రక్రియ సునాయాసమవుతుందని పలువురు భావిస్తున్నారు. ఇదే విషయమై ఎన్‌హెచ్‌ఏఐ పీడీ నాగేశ్వర్‌రావును సంప్రదించగా.. ఆరు వరుసల విస్తరణ ప్రక్రియలో వంతెనల నిర్మాణాలకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. చాలా రోజులుగా జరిగిన ప్రయత్నాలతో చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జికి ఆమోదం లభించిందన్నారు.వీలైనంత త్వరలోనే అక్కడ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆలేరురూరల్: హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని బృందావనం కాలనీకి చెందిన తపెట్ల శ్రీహర్షిత్, అతడి తమ్ముడు తపెట్ల శ్రీవర్షిత్‌తో పాటు జావిద్ యాక్టీవాపై రామసముద్రం దగ్గర గల స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు బయల్దేరారు. దర్గా వద్ద వీరు హైదరాబాద్–వరంగల్ హైవే దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు యాక్టీవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీహర్షిత్ తలకు, శ్రీవర్షిత్‌కు కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వీరిద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీహర్షిత్ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేయగా.. శ్రీవర్షిత్ 7వ తరగతి చదువుతున్నారు. జావిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి..

మునగాల: కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మునగాల మండలం నారాయణగూడెంలో జరిగింది. వివరాలు.. నారాయణగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసాని వెంకటేశ్వర్లు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. మోకు తెగిపోయి చెట్టు పైనుంచి కిందపడ్డాడు. అతడికి కాలు విరగగా, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లును ఆటోలో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం, తోడ్పాటునివ్వాలని గ్రామస్తులు కోరతున్నారు.

మద్యం దుకాణంలో రూ.5లక్షల నగదు చోరీ

రామన్నపేట: రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదురుగా గల శ్రీలక్ష్మి వైన్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన కోనేటి ఎల్లయ్య రామన్నపేటలో శ్రీలక్ష్మి వైన్స్ నిర్వహిస్తున్నాడు. ఆది, సోమవారం మద్యం అమ్మగా వచ్చిన డబ్బులను సోమవారం రాత్రి షాపులోని కౌంటర్‌లో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో షాపు తెరచి చూడగా కౌంటర్‌లోని డబ్బులు కనిపించలేదు. లోపలికి వెళ్లి పరిశీలించగా వెనుక రూం వెంటిలేటర్ పగులగొట్టి ఉంది. సీసీ ఫుటేజీ పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి వెంటిలేటర్ నుంచి లోపలికి ప్రవేశించి కాటన్ డబ్బాను ముఖానికి అడ్డుగా పెట్టుకుని కౌంటర్‌లోని డబ్బులను కాజేసి పారిపోయినట్లు రికార్డయ్యింది. చోరీకి గురైన సొమ్ము రూ.5లక్షలకు పైనే ఉంటుందని వైన్స్ యజమాని ఎల్లయ్య తెలిపాడు. ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చి మొసలి కన్నీరు కారుస్తున్నాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సూర్యాపేటలో జగదీష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలన చేతకాని రేవంత్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంగా ఏర్పడినప్పుడే తెలంగాణ అప్పులతో మొదలైందని, అయినా పదేండ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి పాలన చూడలేదా అని అన్నారు. ఆదాయ వ్యయాల్లో కేసీఆర్‌కు, రేవంత్ కు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రేవంత్ మాట్లాడిన ప్రతిమాట అబద్ధమని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని బట్టే కేసీఆర్ హామీలిచ్చారని చెప్పారు. రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చి అమలు చేతకాక ఇప్పుడు చేతులెత్తేసిండని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి.. గాలిమోటర్లో తిరిగి.. అప్పులు పుడతలేవంటున్నరని, సీఎం హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గి మంత్రుల ఆదాయం పెరగడంతోనే అసలు సమస్య వస్తుందని చెప్పారు. హామీలు ఎగ్గొట్టడం కోసమే రేవంత్ దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పి రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకులు దుర్మరణం



లోకేష్ (ఫైల్)



నిఖిల్ (ఫైల్)

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌ఎల్‌బీసీ కాలనీకి చెందిన మాదగాని లోకేశ్(24), కట్టంగూర్ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దోనిబావి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్(21) స్నేహితులు. లోకేశ్ ఐటీఐ పూర్తిచేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారుచేసే కంపెనీలో అప్రెంటీస్ చేస్తున్నాడు. నిఖిల్ డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. లోకేశ్ మంగళవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై పెద్దోనిబావి గ్రామానికి వచ్చి నిఖిల్‌ను పిలుచుకొని నకిరేకల్ మీదుగా 365వ నంబర్ జాతీయ రహదారిపై అర్వపల్లి వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న రాచకొండ నిఖిల్‌కు తీవ్రగాయాలు కావడంతో పాటు కారును నడుపుతున్న మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన దేశగాని విఠల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిఖిల్, విఠల్‌ను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని, మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఈదురుగాలులకు ఒరిగిన ధ్వజ స్తంభం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లిలో మంగళవారం భారీ ఈదురుగాలులతో కూడి వర్షం కురవగా.. గ్రామ శివారులోని పురాతన శ్రీలక్ష్మీనృసింహస్వామి, మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం ఒక పక్కకు ఒరిగింది. శివాలయంలోని భారీ చెట్లు నేలకొరిగాయి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా 1995లో ఇండియా సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్లు కొండూటి సిద్ధయ్య, పాదిల శ్రీనివాస్ తెలిపారు. విశిష్టమైన ఆలయాలు దెబ్బతినడం పట్ల అర్చకులు నాగేంద్రప్రసాద్‌శర్మ, సాంబశివరావుశర్మ, రామానుజాచార్యులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఒరిగిన ధ్వజ స్తంభం (ఇన్‌సెట్‌లో) స్తంభం కింది భాగం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

- కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



బోల్తాపడిన కారు

తిప్పర్తి: అతివేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. అనంతరం ఆ కారుపై విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈ ఘటన తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో గుంటూరుకు వెళ్లి సోమవారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. కారు ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడిపోయింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి జైలుశిక్ష

నిడమనూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. 2018 నవంబర్‌లో తిరుమలగిరి మండలం తునికినూతల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉబ్బరపల్లి శ్రవణ్ గ్రామసభలో వ్యక్తిగత మరుగుదొడ్ల జాబితా చదువుచుండగా అదే గ్రామానికి చెందిన రమావత్ దేవూనాయక్ లబ్ధిదారుల జాబితాను కార్యదర్శి నుంచి లాక్కొని, అతడి వాహనం తాళం చెవి దుర్భాషలాడాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు సాక్షులను విచారించిన నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దేవూనాయక్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున ఎం. సాధన వాదనలు వినిపించారు.

గాయపరిచిన కేసులో..

గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు..పెద్దవూర మండలం కుకుండుచెట్టుతండా వద్ద కంచర్ల శ్రీను ఎలక్ట్రికల్ సర్వీసింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2016 ఆగస్టులో నిడమనూరు మండలం చెర్వుతండాకు చెందిన రమావత్ హతిరామ్ శ్రీను వద్ద ఫ్యాన్ రిపేరు చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్తూ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో హతిరామ్ ఫ్యాన్ తీసుకొని శ్రీనును గాయపర్చాడు. సాక్షులను విచారించిన నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి హతిరామ్‌కు జడ్జి రూ.1000 జరిమానా లేదా నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



నల్లగొండ రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామగిరి(నల్లగొండ): రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరించే విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ జిల్లా నాయకులు మంగళవారం నల్లగొండ రైల్వే స్టేషన్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలో రైల్వే వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైల్వే రంగంలో భద్రతా చర్యలు పెంచాలని, ప్రమాదాలు అరికట్టాలని ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ వల్ల సరుకు రవాణా చార్జీలు పెరగడంతో వస్తువుల రేట్లు పెరుగుతాయన్నారు. ప్రయాణికుల భద్రత కోసం సరైన చర్యలు చేపట్టాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్యాసింజర్ రైళ్లు పెంచాలని, రైళ్లల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, గంజి నాగరాజు, పల్లె నగేష్, అవుట రవీందర్, నకరెకంటి సత్తయ్య, లింగస్వామి, వెంకన్న, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడు మృతి



చరణ్ (ఫైల్)

వలిగొండ: సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం ఎం. తుర్కపల్లిలో సోమవారం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లికి చెందిన బట్టు సుధాకర్ చిన్న కుమారుడు బట్టు చరణ్(12) చెవిటి, మూగవాడు. సోమవారం మధ్యాహ్నం సుధాకర్ సోదరుడి కుమారుడు బట్టు గౌతంతో కలిసి చరణ్ ఎం. తుర్కపల్లి గ్రామానికే చెందిన తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరికి ఈత రాకపోవడంతో బావి ఒడ్డున స్నానం చేస్తుండగా చరణ్ కాలుజారి బావిలో పడిపోయాడు. భయంతో ఇంటికి వెళ్లిన గౌతం ఇంట్లో ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. సాయంత్రం వరకు చరణ్ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. చరణ్ బావిలో పడిన విషయాన్ని గౌతం కుటుంబ సభ్యులకు చెప్పడంతో బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్లతో నీటిని తోడుతుండగా చరణ్ మృతదేహం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం చరణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

హుజూర్‌నగర్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలు.. చిలుకూరు మండలం లక్ష్మీపురం గ్రామం నుంచి కొందరు అక్రమార్కులు టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నాలుగు మట్టి టిప్పర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. మట్టి టిప్పర్లను పట్టుకున్న విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశామని, వారు జరిమాన విధిస్తారని చెప్పారు. ఎవరైనా అధికారుల అనుమతి లేకుండా మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ బ్యాటరీ అపహరణ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌పేట గ్రామానికి చెందిన రైతు సోకం మల్లేష్ తన వ్యవసాయ బావి వద్ద సోమవారం రాత్రి తన ట్రాక్టర్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. మంగళవారం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్‌లోని బ్యాటరీ కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీ చోరీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బ్యాటరీ విలువ సుమారుగా రూ.12వేలు ఉంటుందని తెలిపాడు.

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

నిడమనూరు: ఈదురుగాలులకు చెల్లాచెదురైన రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నిడమనూరు మండలం కక్కయ్యగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కక్కయ్యగూడేనికి చెందిన కుంచం సైదయ్య(40) ఇటీవల 20 గొర్రె పిల్లలను కొనుగోలు చేశాడు. వాటి కోసం ఇంటి వద్ద తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. సోమవారం రాత్రి వచ్చిన ఈదురుగాలులకు షెడ్డు చెల్లాచెదురైంది. మంగళవారం ఉదయం సైదయ్య రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా.. షెడ్డులో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్ వైరు రేకులకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నల్లగొండ: నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ మైదానంలో మంగళవారం ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ జిల్లా అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నీటిపారుదల శాఖ ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ ఆంజనేయులు, క్రాంతికుమార్, శివరాత్రి శ్రీను, ప్రభాకర్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, మహేష్, చంద్రకాంత్ పాల్గొన్నారు.